క్లుప్తంగా

విజేతలకు సర్టిఫికెట్లు అందజేత

తెలకపల్లి: జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన సైన్స్ డ్రామా జానపద నృత్య పోటీల్లో మండలంలోని పెద్దపల్లి పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, రాకొండలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శర్ఫోద్దీన్, సురేష్‌బాబు, మురళీధర్‌రావు పాల్గొని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని పలు రేషన్ దుకాణాల వద్ద సబ్సిడీ సిలిండర్ల ధ్రువీకరణ పత్రాలను మంగళవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేశారు. 16వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు, కౌన్సిలర్లు సిబ్బుది నర్సింహ్మారావు, శిరీషయాదవ్, పిన్నంశెట్టి జ్యోతి, 5వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మహిమూదాబేగంలు ప్రొసీడింగ్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు బోరెల్లి మహేష్, ఖాదర్‌పాషా తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన బుషారాజు స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు తగుళ్ల కొండల్‌యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వావిళ్ల కొండల్‌యాదవ్, శివ, సాయిబాబా, మల్లేష్, సుధాకర్, ఆంజనేయులు ఉన్నారు.

పోలింగ్‌స్టేషన్ల పరిశీలన

చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా వార్డుల వారిగా పోలింగ్ స్టేషన్లను మంగళవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ పరిశీలించారు. మండలంలోని సారంబండ తండా, తుర్కలపల్లి గ్రామాల్లో ఓటరు జాబితాపై వివరాలను తెలుసుకున్నారు. మెట్లు, ర్యాంపులు, విద్యుత్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు వినోద్, శ్రీలత తదితరులు ఉన్నారు.

విద్యార్థిపై దాడి అమానుషం

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి తాహీర్‌పై పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదడం అమానుష చర్య అని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. మంగళవారం పాఠశాల ఎదుట కేవీపీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తహీర్, ముక్తర్ తదితరులు డిమాండ్ చేశారు.

డీఎస్సీలో అన్నాచెల్లెలుకు ఉద్యోగాలు



తెలకపల్లి: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గన్నోజు ప్రవీణ్ కుమారచారితో పాటు సోదరి శైలజలు డీఎస్సీలో ఉద్యోగాలు పొందారు. అదే గ్రామానికి చెందిన కర్ణె రవి కుమార్ ఎస్‌ఏ ఇంగ్లిష్‌లో సబ్జెక్టులో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. అదేవిధంగా రాజవర్ధన్‌రెడ్డి, శేఖర్, తెలకపల్లికి చెందిన స్వాతి తదితరులు ఉద్యోగాలు సాధించినట్లు అభ్యర్థులు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆందోళన



కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు వినియోగంలోకి తేవాలని విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మూత్రశాలలు వినియోగంలోకి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పాఠశాలలు తెరిచి 4 నెలలు గడుస్తున్నా మరమ్మతు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

కిక్కిరిసిన బస్టాండ్



కల్వకుర్తి టౌన్: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించటంతో ఇంటికి వెళ్లేందుకు వచ్చిన విద్యార్థులతో పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణం కిక్కిరిసింది. మంగళవారం పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. బస్టాండ్‌కు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడ్డారు. బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడ్డారు.



పెంట్లవెల్లిలో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్‌లో



లింగాల ఉన్నత పాఠశాలలో

ఒక్కేసి పువ్వేసి చందమామ..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాపంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బుధవారం నుంచి విద్యాసంస్థలకు దసరా సెలవులు ఉండటంతో ముందస్తుగా సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మను అందంగా పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం గ్రామాల సమీపంలోని చెరువులు, కేఎల్ఐ కాలువలు, కుంటలలో నిమజ్జనం చేశారు.



బిజినేపల్లి మండలం కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



కొల్లాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు



వెల్దండ కస్తూర్బాగాంధీ పాఠశాలలో



అచ్చంపేటలో



తెలకపల్లి సిద్ధార్థ మోడల్ పాఠశాలలో



కొండనాగుల డిగ్రీ కళాశాలలో..

విద్యతోనే పేదరికం దూరం



వెల్దండ: విద్యతోనే పేదరికం దూరం అవుతుందని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యా ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. నూతన పద్ధతులను అవలభించుకొని పట్టుదల, కృషితో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలల్లో ల్యాబ్ సౌకర్యం ఉంటే 10 ల్యాప్‌టాప్‌లను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణరత్నం, వైస్ ప్రిన్సిపల్ జానకి, ఉపాధ్యాయురాలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి విద్యార్థులకు గురుకుల పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను గ్రామానికి చెందిన విశ్వేశ్వరాచారి అందజేశారు. హెచ్ఎం సామ్యనాయక్, ఉపాధ్యాయులు ఇబ్రహీం, వెంకట్రాం, గోవర్ధన్, చెన్నయ్య, రాఘవేందర్, వెంకటేష్, గణేష్, బిట్టు, గఫార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మామిడి తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఆదిశంకర్

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో మంగళవారం రైతు వేదిక వద్ద జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ఆదిశంకర్, డివిజన్ ఉద్యాన అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ మామిడి రైతులు నెలవారిగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మామిడి పంటకు ముందు, పంట దశలో కోత అనంతరం సంబంధించిన ఉత్పత్తుల గురించి వివరించారు. ఉమ్మడి జిల్లాలో 57వేల ఎకరాల మామిడి తోటలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను మెగా క్లస్టర్‌గా కేటాయించిందని తెలిపారు. జిల్లాలో కొల్లాపూర్ మామిడి సురభి వంశస్తుల నుంచి నేటి వరకు దేశ, విదేశాల్లో ఎంతో ప్రసిద్ధి పొందిందన్నారు. రైతులు కొమ్మ కత్తిరింపు, తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్యం, పూత, పిందె దశలో చేపట్టాల్సిన మెళకువలు వంటివి తీసుకోవాలని అన్నారు. మామిడి రైతులు ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పృథ్వీరాజు, నవ్యభారతి, సువర్ణ, సురేష్, రాకేష్, చంద్రశేఖర్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



తాడూరు: మండలంలోని రాంరెడ్డిపల్లి, యాదిరెడ్డిపల్లి, ఎట్టిదారిపల్లి గ్రామాలను మంగళవారం ఎంపీఓ బ్రహ్మాచారి సందర్శించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై వారికి అవగాహన కల్పించారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



కొల్లాపూర్: రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రుణమాఫీ కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఆర్. శ్రీనివాసులు, మండల కార్యదర్శి శివవర్మ, దశరధం, బాలపీరు, కిరణ్‌కుమార్ ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వమే కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 2 జతల బట్టలు ఇవ్వాలని, వేతనాలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఆంజనేయులు, మారేడు శివశంకర్, సహాయ కార్యదర్శి చిన్న పాగ శ్రీనివాసులు, కార్మికులు రాంచంద్రయ్య, చెన్నమ్మ, మల్లేష్, ఎల్లమ్మ, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓల నిరసన

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలానికి చెందిన ఏఈఓలు డిజిటల్ క్రాప్ సర్వేలు చేయలేమని మంగళవారం మండల కేంద్రానికి చెందిన రైతువేదిక వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా సర్వేవారిగా రైతు వేసిన పంటను ఫొటో తీసి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పనిభారం పడుతుందన్నారు. ఏఈఓలు సాయిరాం, శివకుమార్, శివసాగర్, అబ్దుల్లా నవాజ్, విజయ్‌కుమార్, నాజ్‌నీన్, సాయిత, హేమ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా రాజేష్‌రెడ్డి కోరారు. మంగళ వారం మండలంలోని పెద్దముద్దునూర్‌లో ఇందిరా మహిళా శక్తి శ్రీరామ మిల్క్ పార్లర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ రమణారావు, మాజీ సర్పంచ్ స్వామి, శ్రీకాంత్‌రావు, భగవంత్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.



కోడిపిల్లలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ ఓబులేష్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టిపల్లిలో రాజశ్రీ కోడిపిల్లల పెంపక షెడ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొత్తం రూ.2.50 లక్షలు నిధులతో షెడ్ నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో శ్రీనిధి రుణాలు రూ.4.53 కోట్లు ఇచ్చామని వివరించారు. అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, ఆర్ఎం శ్రీనిధి మహేందర్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



కొల్లాపూర్‌లో వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న అధికారులు



పెద్దకొత్తపల్లి పెద్దకార్పాముల అంగన్‌వాడీ కేంద్రంలో

కొల్లాపూర్: పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమాన్ని మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరీ, ఆర్డీఓ నాగరాజు, సీడీపీఓ వెంకటరమణలు సందర్శించి, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వృద్ధులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, వారి హక్కుల గూర్చి వివరించారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు కృష్ణమోహన్, చిట్టిబాబు, శివశంకర్, కౌన్సిలర్ వెంకటేశ్వరమ్మ తదితరులున్నారు.

వృద్ధులకు సన్మానం

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల 1వ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను అంగన్‌వాడీ టీచర్లు సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, మంజుల, అలివేల, భాగ్యమ్మ, ఏఎన్ఎం పార్వతమ్మ, రేణుక పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటయ్య పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మమ్మ, పరమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలపై దృష్టి మరల్చేందుకే 'హైడ్రా'మా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై దృష్టి మరల్చేందుకే హైడ్రా డ్రామాను తెరపైకి తెచ్చారని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నా కాల్వలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. చేతనైతే నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కళాశాల తీసుకొచ్చి అభివృద్ధికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పాటుపడాలని సూచించారు. పోలీసు అధికారులను అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యే పేదలపై కేసులు పెట్టించి జైలుకు పంపించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, అర్జుంరవి, బాలగౌడ్, భాస్కర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న వాటర్ గ్రిడ్ డీఈఈ సుదర్శన్

ఉప్పునుంతల: తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అచ్చంపేట వాటర్ గ్రిడ్ డీఈఈ సుదర్శన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న తాగునీటి సహాయకుల(వాటర్ మెన్ల) శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న మోటర్లు, హ్యాండ్ పంపుల మైనర్ రిపేర్లు, తాగునీటి సరఫరాలో చిన్న చిన్న పైప్‌లైన్ లీకేజీలను సరిచేసుకోవడం, అదేవిధంగా గ్రామాల్లో రక్షిత తాగునీటి బోర్ల నుంచి వచ్చే తాగునీటిని, మిషన్ భగీరథ ద్వార వస్తున్న తాగునీటిని వాటర్‌మెన్ తన పరిధిలో పరీక్షించుకోవడం వంటి అంశాలపై ట్రైనర్ శంకర్ అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఆయా గ్రామాలకు చెందిన వాటర్‌మెన్లు పాల్గొన్నారు.

వాటర్‌మెన్లకు అవగాహన

వెల్దండ: తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని వాటర్‌మెన్లకు మిషన్‌భగీరథ ఈఈ శ్రీధర్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని 32 గ్రామాల్లోని వాటర్‌మెన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్‌భగీరథ పథకం ద్వారా నీటిని శుద్ధి చేసి గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లకు సరఫరా చేస్తున్నామన్నారు. పైపులైన్ లీకేజీలు అయితే వెంటనే మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, మిషన్‌భగీరథ గ్రిడ్ డీఈఈ మణిపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సంధ్యారాణి, ఏఈ లలిత, ప్రతిభ, సిబ్బంది ఉన్నారు.

పంట రుణాలు ఇవ్వాలని ధర్నా



ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

పెద్దకొత్తపల్లి: వానాకాలం సీజన్‌లో రైతులకు పంట రుణాలు ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట బీజేపీ కార్యకర్తలు, రైతులు ధర్నా నిర్వహించారు. మూడు గంటల పాటు ధర్నా కొనసాగినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు బ్యాంకులోకి చొచ్చుకువెళ్లి కార్యకలాపాలను అడ్డుకున్నారు. పెద్దకొత్తపల్లి పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ సిబ్బందితో బ్యాంకు వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను, రైతులను శాంతింపజేసేందుకు యత్నించారు. బ్యాంకు మేనేజర్ సోమేష్‌కుమార్ దసరా పండుగ తర్వాత అర్హులైన రైతులందరికి కొత్త రుణాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుమల్, మధు, శివ, వెంకటస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన స్వయంభు భీమలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మోహన్‌గౌడ్, అధ్యక్షుడిగా పగిడిపాల విష్ణు, ఉపాధ్యక్షులుగా వీరబొమ్మ వెంకటేష్, ఆలేటి మధు, కాసాని సత్యనారాయణ, దార్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జర్పుల వెంకటేష్, కోశాధికారిగా వెన్ను మల్లేష్ ఎన్నికయ్యారు. అలాగే మహిళా కమిటీ అధ్యక్షురాలిగా మాకం పద్మ, ఉపాధ్యక్షురాలిగా నిర్మల, కానుగుల శ్యామల ఎన్నికయ్యారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ దేవాలయాల అధ్యక్షులు, హిందూ సంఘాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

కల్వకుర్తిరూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వెల్ఫేర్ బోర్డు నిర్వాహణ బాధ్యతలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. యాదయ్య, ప్రభాకర్, రాజు, దర్శన్‌రెడ్డి, బాలమల్లు తదితరులు ఉన్నారు.

దసరా ఉత్సవాల పుస్తకం ఆవిష్కరణ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా మేశ్వరి దేవాలయంలో నిర్వహించే దసరా ఉత్సవాల పుస్తకాన్ని మంగళవారం దేవాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 3 తేది నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తునట్లు ఆలయ చైర్మన్ జూలూరి రమేష్ బాబు తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

పెంట్లవెల్లి: చేపల వేటకు వెళ్లి యువకుడి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామన్‌గౌడ్ వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన యువకుడు ఆంజనేయులు(35) సోమవారం చేపలు పట్టేందుకు చవుట చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. మంగళవారం మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని చెరువులోనుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన నిమ్మల శంకర్ అటవీ ప్రాంతంలో అదృశ్యమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 28న శనివారం అడవి దుంపల సేకరణకు మిత్రుడు కృష్ణతో కలిసి వెళ్లాడు. అదేరోజు రాత్రి ఇద్దరు కలిసి అటవీ ప్రాంతంలో ఒక దగ్గర నిద్రించగా ఉదయం లేచిచూసేసరికి శంకర్ కనిపించలేదు. దీంతో కృష్ణ, కుటుంబ సభ్యులు అడవిలో ఇతర ప్రాంతాలలో వెతికిన ఆచూకి లభ్యం కాలేదు. శంకర్ భార్య నిమ్మల లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ వెంకటేష్ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనారోగ్యం బారినపడి ఇటీవల మృతి చెందాడు. ఇంటర్మీడియేట్ 1991–92 బ్యాచ్‌కు చెందిన మిత్రులు మంగళవారం బాధిత కుటుంబానికి రూ.26000 వేలు అందజేశారు.

